క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



కారెంపూడి: మండలంలోని చినకొదమగుండ్ల గ్రామానికి చెందిన ఐదు టీడీపీ కుటుంబాలకు చెందిన వారు పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వెంకటరామిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జక్కుల వీరయ్య, జక్కుల పెద నరసింహారావు, జక్కుల చిన నరసింహారావు, జక్కుల కోటయ్య, జక్కుల చిన వీరయ్య కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. చినకొదమగుండ్ల గ్రామ సర్పంచ్ జెడ్డా కోటిరెడ్డి, మండల పార్టీ నాయకుడు మందాళ్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం



కారెంపూడి: స్థానిక శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణోత్సవాన్ని బుధవారం భక్తులు వైభవంగా జరిపించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు శాంతి హోమాన్ని అర్చకులు వినోద్, హేమంత్‌లు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని వారు శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో మిత్తింటి కొండలు, మిత్తింటి సాంబశివరావు, గుండా శ్రీనివాసరావు, చిట్టోజు భాస్కర్, కొండోజు ఆంజనేయులు, అద్దంకి స్వామి తదితరులు కల్యాణోత్సవ నిర్వహణలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దీంతో బ్రహ్మంగారి ఆలయం ఉత్సవ శోభను సంతరించుకుంది.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు పేదలకు వరం



విజయపురిసౌత్: గ్రామీణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. బుధవారం మాచర్ల మండలంలోని పశువేముల గ్రామంలోని సచివాలయంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ ప్రతి ఇంటికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీవో అద్దెయ్య, మాచర్ల తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఆర్ఐ ఫణీకుమార్, పంచాయతీ కార్యదర్శి బాబులాల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సచివాలయం సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



గురజాల : స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన బత్తుల రామలింగయ్య 18వ వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగివుండాలన్నారు. ఈ సందర్భంగా రామలింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కావూరి అంజిబాబు, బత్తుల తిమ్మరాజు, బత్తుల కోటేశ్వమ్మ, లింగయ్య, నాగేశ్వరరావు, ప్రసాద్, మరియు కుటుంబ పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

మాచవరం: నిద్రిస్తున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసును అపహరించిన ఘటన మండల కేంద్రమైన మాచవరంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బ్రహ్మంగారి గుడి బజార్‌కు చెందిన కొత్త అనంతలక్ష్మి ఇంటి ముందు ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మహిళ మెడలోంచి మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. బంగారు గొలుసు విలువ సుమారు రూ.65 వేలు వరకు ఉంటుందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు.

శరవేగంగా పీహెచ్‌సీ అదనపు గదుల నిర్మాణం



నిర్మాణంలో ఉన్న ముటుకూరు పీహెచ్‌సీ భవనాలు

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత రంగంగా వైద్య, ఆరోగ్య శాఖకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజలకు విస్తృత ఆరోగ్య సేవలందించేందుకు పకడ్బందీగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మిస్తున్నారు. మండల పరిధిలోని ముటుకూరు గ్రామంలో ప్రస్తుతం కొనసాగుతున్న పీహెచ్‌సీకి అదనంగా 8 పడకల ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా కొనసాగుతుంది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎటువంటి సౌకర్యాలు లేక వెలవెలబోయిన ఆసుపత్రులు నేడు అత్యాధునిక వసతులతో వైద్యులు, సిబ్బంది, ఉచితంగా మందులు అందుబాటులో ఉంచి ప్రజారోగ్యానికి ప్రాముఖ్యతను కల్పించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆసుపత్రిలో కనీసం దూది లేని పరిస్థితి నుంచి నేడు 24గం''లు వైద్యులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తీసుకున్న చర్యలకు ప్రజలు ఆనందం తెలుపుతున్నారు. నాడు నేడులో భాగంగా ప్రస్తుతం రూ. 1.57 కోట్ల వ్యయంతో 8 పడకల గదుల నిర్మాణం జరుగుతుంది. ఆపరేషన్ థియేటర్‌తో పాటు మెడికల్ గది, కన్సల్టెంట్ గది, వైద్యుల గదులు నిర్మాణం కానున్నాయి. ఈ ఆసుపత్రి పరిధిలో కంచరగుంట, ఆత్మకూరు, తేరాల, పోలేపల్లి, నెహ్రూనగర్‌తండా, యర్రబాలెం, కోలగుట్ల, మంగాపురంతండా తదితర గ్రామాల ప్రజలకు 24గం''ల ఆరోగ్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చొరవతో కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల్లో ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సిద్ధం



ఆసుపత్రి నిర్మాణం పనులు చకచకగా జరుగుతున్నాయి. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దూరదృష్టితో ముటుకూరు పీహెచ్‌సి అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంతో పాటు, వైద్యంకు ప్రత్యేక శ్రద్ధ చూపడం పేద ప్రజలకు వరం. మరో రెండు నెలల్లో ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– ఎంపీపీ యేచూరి సాయి శంకర్

టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కారెంపూడి: అభివృద్ధి చేసి చూపడంలో సత్తా చూపిన వాళ్లనే నాయకులని ప్రజా సేవలకులనే గుర్తింపు వస్తుంది కాని మేము మగాళ్లమని టీడీపీ నాయకులు చెప్పే మాటల వల్ల అది అయ్యేపని కాదని తెలుసుకోవాలని మండల వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హితవు పలికారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో జూలకంటి బ్రహ్మారెడ్డి ఫ్లెక్సీ కూలిపోతే దానికి వైఎస్సార్ సీపీ నాయకులు కారణమని ఆరోపిస్తూ మగాళ్లయితే డైరెక్టు రాజకీయాలు చేయాలని రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని ప్రజా నాయకుడు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేతిలో నాలుగు సార్లు ఓడిపోయి ఎప్పుడో మీరు అలా మాట్లాడే అర్హత కోల్పోయారని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉండి మీరు ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. జన్మభూమి కమిటీల పేరుతో జేబులు నింపుకోవడం తప్ప ఏ ఒక్కరికైనా నిజాయితీగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించారా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన మేలు గురించి ప్రతి గడప చెబుతుందన్నారు. ప్రతి గడపకు కెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి చెంతకే ప్రభుత్వ సేవలను తీసుకెళ్లి అందిస్తున్నామన్నారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా పీఆర్కే ప్రజలకు మంచి చేయాలని ప్రతి క్షణం కష్టపడుతున్నారని, మీరు ఆనాడు అధికారంలో ఉండగా పార్టీ వారిపై ఎన్ని దొంగ కేసులు పెట్టినా ప్రజల కోసం అన్నీ భరించారన్నారు. వరికెపూడిశల ప్రాజెక్టు మా వల్ల కాదని చేతులెత్తేశారని కాని మా ఎంపీ, ఎమ్మెల్యే పట్టుదలతో దానికి అన్ని అనుమతులు తెప్పించి నిర్మాణానికి బాటలు వేశారని ముఖ్యమంత్రి దానికి నిధులు కూడా కేటాయించారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా ప్రజలకు ఏమి చేశారు, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలోనే చేసిన అభివృద్ధిని గురించి తెలుసుకుంటే ఎవరు మగాళ్లో ఇట్టే తేలుతుందన్నారు. అధికారంలో ఉండగా ఏనాడైన ప్రజల గడప వద్దకు టీడీపీ నాయకులు వెళ్లి వారికి మేలు చేసిన దాఖలాలులేవని ప్రజలనే వారి వద్దకు తిప్పుకుని వారి జేబులు ఖాళీ చేయించి అరకొర సంక్షేమం అందించారని ఎద్దేవా చేశారు. కాని ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల, మతం, పార్టీలు చూడకుండా అర్హులైన అందరికి సంక్షేమ పథకాలు నిజాయితీగా పారదర్శకంగా అందిస్తూ ముందుకుపోతోందన్నారు. ఇలాంటివి బేరీజు వేసుకుని మాట్లాడితే బాగుందని సలహా ఇచ్చారు. పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. కారెంపూడి సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఒప్పిచర్ల సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ కొండలు, మాజీ సర్పంచ్ రామదేని లక్ష్మీఆంజనేయులు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు పంగులూరి అంజయ్య, ఎంపీటీసీలు అంతరగడ్డ ఏసోబు, షేక్ ఆరీఫ్, వేముల పద్మలింగయ్య, వివిధ హోదాల పార్టీ నాయకులు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, ఆశం విజయభాస్కరరెడ్డి, కొమెర పిచ్చెయ్య, ఇరికెదిండ్ల లాజర్, బత్తిన వెంకయ్య, పంగులూరి బుచ్చెయ్య, పాలకీర్తి నరేంద్ర పాల్గొన్నారు.

వెల్దుర్తిలో 'మా నమ్మకం నువ్వే జగనన్న'



పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి

వెల్దుర్తి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారన్నారని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి జూలకంటి వీరారెడ్డిలు అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రమైన వెల్దుర్తిలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలను వివరించి అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు రాకపోతే వారికి వెంటనే వచ్చేలా అధికారులతో మాట్లాడతామన్నారు. కరపత్రాలు అందించి, స్టిక్కర్లు అతికించారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అందజేస్తున్న పథకాల తీరు పై లబ్ధిదారులను అడిగి అభిప్రాయం తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కేసిరెడ్డి వెంకటరెడ్డి, పులుసు నారాయణ రెడ్డి, జూలకంటి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కేసిరెడ్డి పిచ్చిరెడ్డి, కోట్ల పాపిరెడ్డి, నాగిరెడ్డి, పులుసు చిన కోటిరెడ్డి, నందివెలుగు ప్రతాపరెడ్డి, చింతా ఆదినారాయణ, మధుసూదనరెడ్డి, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ పై అవగాహన

దుర్గి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిగొప్పల అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ వెంకయ్య అన్నారు. బుధవారం అడిగొప్పలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ అడవుల్లో నిప్పులు వేయడం, చెట్లు కొట్టడం లాంటి చర్యలకు పాల్పడవద్దని గ్రామస్తులను కోరారు. సర్పంచ్ నలబోతు వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినప్పుడే వాతావరణం సహకరించి సకాలంలో వర్షాలు పడేందుకు దోహదం చేస్తాయన్నారు. ప్లాస్టిక్, డిస్పోజల్‌ను విరివిగా వాడుతున్నారని, వాటిని ఎక్కడబడితే అక్కడ వేయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ టి వెంకయ్య, బీట్ ఆఫీసర్లు వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం



నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీబ్రహ్మానందరెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని బుధవారం గురజాల తహసీల్దార్ ఎం.దానియేల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, పాఠశాల విద్య నుంచే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, లలిత కళలపై ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఆనందం కలుగుతుందన్నారు. క్రీడాస్ఫూర్తి అలవడిన విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకొని ఉన్నతంగా ఎదుగుతారని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజనందరెడ్డి జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాల వ్యాయామ సంచాలకులు డాక్టర్ జీపీ రాజు, ఎన్ఈసీ కళాశాల పీడీ ఎల్.కృష్ణారెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి.ఇజ్రాయిల్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

ఈపూరు: కౌలుకు భూమిని సాగు చేసుకుంటున్న రైతులు తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.రామారావు తెలిపారు. మండలంలోని వనికుంట, కొండాయపాలెం గ్రామాల్లో ఖరీఫ్ సాగు సమాయత్తంపై బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రామారావు మాట్లాడుతూ ఆర్‌బీకే కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు ముందుగానే అందుబాటులో ఉండేవిధంగా సిబ్బంది చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, వనికుంట సర్పంచి బచ్చనబోయిన వెంకట సుబ్బయ్య, కొండాయపాలెం గ్రామసర్పంచి కేతినేని వెంకట్రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.ఆనంద్‌బాబు, వి.గణేష్ పాల్గొన్నారు.

హజ్ యాత్రను రాజకీయం చేయడం తగదు

జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ గఫార్



పిడుగురాళ్ల: హజ్ యాత్రను రాజకీయం చేయడం తగదు అని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ గఫార్ అన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రను సంబంధించిన సెంట్రల్ హజ్ కమిటీ నిర్ణయించిన టికెట్ ధరలపై హజ్ యాత్రికులు ఆందోళన చెందొద్దని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కొత్త రాష్ట్రం నుంచి హజ్ యాత్ర చేసే ముస్లిం సౌకర్యార్థం విజయవాడకు ఎంబర్కేషన్ పాయింట్‌గా ఏర్పాటు చేసేందన్నారు. సెంట్రల్ హజ్ కమిటీ నిర్ణయించిన ధరల అభ్యంతరకంగా ఉన్నాయన్నారని, హైదరాబాద్ నుంచి యాత్ర చేసేవారికి రూ. 3.04 లక్షలు, విజయవాడ నుంచి వెళ్లే వారికి రూ. 3.88 లక్షలు ధరలు నిర్ణయించడంతో ముస్లింలో ఆందోళన మొదలైందన్నారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా బావించే హజ్ యాత్రను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం సరికాదన్నారు.

జేసి శ్యాంప్రసాద్‌ని సన్మానించిన వీఆర్ఓ సంఘం నేతలు



జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను సన్మానిస్తున్న వీఆర్ఓల జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, నేతలు

మాచర్ల రూరల్: పల్నాడు జిల్లాలో వీఆర్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూలంగా స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అండగా ఉంటున్న పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను పల్నాడు జిల్లా వీఆర్ఓల జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు సన్మానించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను వీఆర్ఓలు కలిసి శాలువా, పూల బొకెలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్ఓల సంఘ నాయకులు ఎస్ కొండలు, రవికుమార్, కాశీవిశ్వనాథ్, అనిల్, జలీల్, గోపాల్‌రెడ్డి, మూర్తి, నాయక్, వలి, హుస్సేన్, ప్రశాంతి తదితరులున్నారు.

80 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



భూమిలో పాతిపెట్టిన బెల్లంఊటను పరిశీలిస్తున్న పోలీసులు

దాచేపల్లి : మండలంలోని భట్రుపాలెంలో అక్రమంగా భూమిలో పాతిపెట్టిన బెల్లంఊటను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. జనసేన మండల శాఖ ఉపాధ్యక్షుడు బాణావత్ అనిల్‌నాయక్ తండ్రి బాలునాయక్ తన పోలంలో తయారు చేసి డబ్బాలో పోసి భూమిలో పాతిపెట్టిన 80లీటర్ల బెల్లంఊటను పోలీసులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. నాటుసారా తయారీకి అవసరమైయ్యే బెల్లంఊటను అక్రమంగా అనిల్‌నాయక్ తండ్రి బాలు నాయక్ గత కొంతకాలంగా తయారు చేస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఈబీ అధికారులు స్థానిక పోలీసులు కూడా దీనిపై దృష్టిసారించారు. ఈ క్రమంలో బాలునాయక్ బెల్లంఊట తయారు చేసి డ్రమ్ములో పోసి పొలంలో పాతినట్లుగా పోలీసులకు సమాచారం అందింది. సీఐ షేక్ బిలాలుద్దీన్ ఆధ్వర్యంలో ఎస్ఐ జీ. సంధ్యారాణి భట్రుపాలెం-కాట్రపాడు గ్రామాల మధ్యలో ఉన్న బాలునాయక్ పొలంలో తనిఖీలు చేశారు. డ్రమ్ములో భద్రపరచిన బెల్లంఊటను పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న 80 లీటర్ల బెల్లంఊటను పోలీసులు ధ్వంసం చేశారు. బాలునాయక్ పరారీలో ఉన్నాడు. గతకొంతకాలంగా బాలునాయక్ అక్రమంగా బెల్లంను తీసుకువచ్చి నాటుసారా తయారీ కోసం బెల్లంఊట తయారు చేస్తున్నట్లుగా పోలీసులు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో బాలునాయక్‌తో పాటు ఇంకేవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ చేస్తున్నామని సీఐ బిలాలుద్దీన్ చెప్పారు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష



గణపవరం సీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల హాల్‌టిక్కెట్లు పరిశీలిస్తున్న కళాశాల సిబ్బంది

నాదెండ్ల: పాలిసెట్ 2023 ప్రవేశ పరీక్ష చిలకలూరిపేట నియోజకవర్గంలోని ఆరు కేంద్రాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగింది. 1870 మంది విద్యార్థులకు గాను 1654 మంది(88.4శాతం) పరీక్షకు హాజరయ్యారు. గణపవరం సీఆర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 400 మందికి గాను 344 మంది హాజరయ్యారు. చిలకలూరిపేట ఏఎంజీ కేంద్రంలో 400కు గాను 364 మంది, శారదా హైస్కూలులో 350కు 313 మంది, ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూలులో 350కు 314 మంది, మోడరన్ గ్రీన్ వ్యాలీలో 203 మందికి గాను 175 మంది, చైతన్య హైస్కూలులో 167 మందికి గాను 144 మంది హాజరయ్యారు. ఒక్క నిమిషం నిబంధనను పక్కాగా అమలు చేశారు. సీఆర్ కళాశాల సెంటర్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.డేవిడ్‌రాజు, జిల్లా అబ్జర్వర్‌గా మస్తానయ్య, రూట్ ఆఫీసర్ ఎన్‌సీహెచ్ రామన్న, సెంటర్ అబ్జర్వర్ విజయకుమార్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమై ఒంటి గంటకు పరీక్ష ముగిసింది. అభ్యర్థులు 9 గంటలకే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు. 9.45 నిమిషాలకు పరీక్ష కేంద్రంలోనికి హాల్‌టికెట్లు తనిఖీ చేసి అనుమతించారు. 11 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ కానందున పరీక్ష కేంద్రం వద్ద ఆధారాలు చూపి పొందారు. డెప్యూటీ కోఆర్డినేటర్‌గా పి.లక్ష్మీరాజ్యం పర్యవేక్షించారు.

గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులపై అధ్యయనం



నూజెండ్ల: విద్యార్థులు గ్రామాల్లో ప్రజల సమస్యలు పూర్తిస్థాయిలో తెలుసుకొని ఇంటర్న్‌షిప్‌లో డాక్యుమెంట్లు అందజేయాలని కేంద్ర సోషల్ జస్టిస్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు టి.నరసింహ అన్నారు. నూజెండ్ల మండలం జడ్డవారిపాలెంలో పారా లక్ష్మయ్య స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ గ్రామాల్లో ఉందని, గ్రామస్వరాజ్యం సాధించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని తెలిపారు. విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అధ్యయనం చేసి ప్రజలకు ఏ స్థాయిలో లబ్ధి చేకూరుతుందో గుర్తించాలన్నారు. స్టడీ సర్కిల్ అధినేత పారా లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పబ్లిక్ పాలసీ, ఆంత్రోపాలజీపై కోర్సులు గ్రామీణ ప్రాంతాల ప్రజల గురించి, వారి పరిస్థితులు సమగ్రంగా తెలుస్తాయన్నారు. ఇంటర్న్‌షిప్ విద్యార్థి విభాగం ఓం ప్రకాష్ మాట్లాడారు.

పేటసన్నెగండ్లలో పొలం బాటల అభివృద్ధి పనులు



పొలంబాట అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో పొలం బాటలను బాగు చేసే పనులకు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం శ్రీకారం చుట్టారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అందుకు అవసరమైన యంత్ర సామగ్రిని వారికి పంపారు. జేసీబీతో చెరువు కట్ట నుంచి కొండ వైపు వెళ్లే పొలాల బాటల కిరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించే పనులు చేపట్టారు. పనులను మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ పంగులూరి చిన వెంకటనర్సయ్య, పంగులూరి రామకృష్ణయ్య, ఉన్నం ఆదిశేషగిరిరావులు ప్రారంభించారు. గ్రామంలో పది దాకా పొలం వెళ్లే బాటలున్నాయని వాటికిరువైపులా ఉన్న కంపచెట్లు తొలగించి శుభ్రం చేయడంతో పాటు గ్రావెల్ తోలి చదును చేయడం చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుందని ఈ నేపథ్యంలో వేసవిలో ఆ పనులు పూర్తి చేయాలని తలచి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు తెలిపితే జేసీబీ, టిప్పర్లు పంపారని వాటితో రైతుల సహకారంతో వాటిని అభివృద్ధి చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జవ్వాజి బాలరాజు, పార్టీ నాయకులు మారాబత్తుల శ్రీను, నేలపాటి వీరయ్య, నరసింహారావు, తోడేటి సుబ్బారావు, మామిడి శేఖర్, బెల్లంకొండ రామారావు పాల్గొన్నారు.

178 మందికి ఇంటి పట్టాల పంపిణీ

దాచేపల్లి : నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉందని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య అన్నారు. దాచేపల్లిలోని నాయుడుపేటలోని జగనన్న రెండవ లే అవుట్ 178 మంది నిరుపేదలకు బుధవారం పట్టాలు పంపిణీ చేశారు. నిరుపేదలకు చేతికి పట్టాలు అందించి స్థలాన్ని కూడా చూపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చైర్మన్ సుబ్బమ్మ సాంబయ్య మాట్లాడుతూ..గత ప్రభుత్వాలు పేదలకు ఖాళీ పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇంటి స్థలాన్ని కూడా దగ్గరుండి చూపించామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఖాళీ ఇంటి పట్టాలు ఇచ్చిన వారికి కూడా కొత్తగా పట్టాలు ఇచ్చి స్థలం చూపించామని తెలిపారు. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇంటి పట్టాలు ఇచ్చామని చైర్మన్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో జగనన్న లేఅవుట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, ఇప్పటికే కరెంట్, మంచినీటి సరఫరా అందించామని, త్వరలో సిమెంట్ రోడ్లు కూడా నిర్మిస్తామని చైర్మన్ వ్యాఖ్యానించారు. జగనన్న మూడవ లేఅవుట్‌లో మరో 1000 మందికి పైగా ఇంటి పట్టాలు ఇచ్చి స్థలాలు ఇస్తామని చెప్పారు. ఇంటి పట్టాలు పొందిన నిరుపేదలంతా త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని, ఇళ్ల నిర్మాణంలో దాచేపల్లి జగనన్న లే అవుట్ రెండవస్థానంలో ఉందని చైర్మన్ అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, నాగుబండి గురువులు, మండపాటి వీరారెడ్డి, వందనపు వెంకట్రామయ్య, షేక్ షరీఫ్, ఈదా వెంకటరెడ్డి, వేల్పుల ధర్మదేవ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు యర్రంశెట్టి సైదారావు, బుగ్గల జానీ, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, నాయకులు కొలా జంపాలరెడ్డి, కొప్పుల రామకృష్ణా, ఐనాల శ్రీరాములు, గంగ్రికల సైదారావు, సయ్యద్ మౌలాలీ, వలి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బండ్ల పనితీరును పరిశీలించిన జేసి



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

మాచర్ల: పట్టణంలో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ విస్తృతంగా గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు చోట్ల రేషన్ వాహనాల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ ప్రతి నెలా సక్రమంగా ఇస్తున్నారా లేదాని, బియ్యం ఇస్తున్నారా? డబ్బులిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కందిపప్పు ఎంత, రేషన్ బియ్యం ఎంతకు ఇస్తున్నారు, పంచదార ఎంతకు విక్రయిస్తున్నారని పలువురు కార్డుదారులను అడగగా సక్రమంగానే పంపిణీ జరుగుతుందని వారు తెలిపారు. ఈయన వెంట తహసీల్దార్ జి రమేష్‌కుమార్, సిఎస్ డిటీ మురళీ, రెవిన్యూ సిబ్బంది తదితరులున్నారు. ఈ సందర్భంగా రేషన్ పంపిణీ దారులతో మాట్లాడుతూ ప్రతి నెలా తప్పనిసరిగా వాహనాలలో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎటువంటి ఆరోపణలు రాకుండా పంపిణీ కార్యక్రమాన్ని చేయాలని కోరారు.

రైతులు అధిక పాల ఉత్పత్తి సాధించాలి

బొల్లాపల్లి: పాడి పరిశ్రమలో యాజమాన్య పద్ధతులు అవలంబించి అధిక పాల ఉత్పత్తి సాధించాలని నరసరావుపేట పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎన్‌సీహెచ్ నరసింహులు సూచించారు. మండలంలోని మూగచింతలపాలెం రైతు భరోసా కేంద్రంలో బుధవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీ ద్వారా అందజేస్తున్న సమీకృత దాణాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెయ్యదూడల ఉత్పత్తిలో భాగంగా త్రిపుల్ ఎస్ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాసమూర్తి, పశువైద్యాధికారి పి.అమీర్‌బాషా, ఏహెచ్ఏ ఏడుకొండలు పాల్గొన్నారు.